క్లుప్తంగా

భగవన్నామస్మరణతో మోక్షం

రేగిడి: భగవన్నామస్మరణతోనే మోక్షం సాధ్యమవుతుందని రేగిడి దత్తపీఠం ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యన్నారాయణనాయుడు అన్నారు. ఆదివారం స్థానిక దత్తపీఠంలో నిర్వహించిన ఆధ్యాత్మిక సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భగవంతుడిని నిత్యం స్మరించుకోవాలని, అలా చేస్తే మనసు ప్రశాంతతతో పాటు దుఃఖాలు దరిచేరవన్నారు. దైనందిన జీవితంలో ప్రతిఒక్కరూ కొంతసమయం ఆధ్యాత్మికంగా గడిపితే మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో రేగిడి దత్తపీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేశమ్మ తల్లి వారాలు


రామభద్రపురంలో దేశమ్మతల్లికి మొక్కులు తీర్చుకునేందుకు వెళుతున్న భక్తులు

రామభద్రపురం: మండలంలోని పలు గ్రామాలలో దేశమ్మ తల్లి వారాలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. రామభద్రపురం, ఇట్లామామిడిపల్లి, తదితర గ్రామాల్లో మహిళలు ముర్రాటలతో బయలుదేరగా.. యువత మేళతాళాల నడుమ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పంటలు బాగా పండి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నట్లు ఆయా గ్రామాల పెద్దలు చెప్పారు.

వరిలో కాలిబాటలు తప్పనిసరి


వాసుదేవపట్నంలో వరిసాగులో కాలిబాటలు తీస్తున్న మహిళా రైతు

సంతకవిటి: వరి సాగు చేసే రైతులు పంటలో కాలిబాటలు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని మండల వ్యవసాయాధికారి పైల నవీన్ ఆదివారం తెలిపారు. యాజమాన్య పద్ధతుల్లో భాగంగా ఉభాలు వేసిన 10 నుంచి 15 రోజుల్లోపు కాలిబాటలు ఏర్పర్చుకోవడం మంచిదన్నారు. ప్రతీ రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల కాలిబాటలు గాలివాటంగా తీయాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా పంటకు గాలి, వెలుతురు బాగా తగిలి, పంట ఏపుగా పెరుగుతుందని, వరి దుబ్బులకు ఎరువు సక్రమంగా సరఫరా అవుతుందన్నారు.

తోటపల్లి కాలువ ద్వారా సాగునీరు విడుదల


కంచరాం సమీపంలో తోటపల్లి కాలువలో ప్రవహిస్తున్న సాగునీరు

రాజాం: మండలంలోని తోటపల్లి కాలువ ద్వారా సాగునీరు విడుదలైంది. దీంతో కంచరాం, చీకటిపేట, బొద్దాం తదితర గ్రామాల ఆయకట్టు రైతులు ఈ నీటి సాయంతో వరినాట్లు వేయడం ప్రారంభించేశారు. అడపాదడపా వర్షాలు కూడా కురుస్తుండడంతో అన్నిచోట్ల ఖరీఫ్ పనులు కూడా ఊపందుకున్నాయి.

శరవేగంగా కోనేరు సుందరీకరణ పనులు


పొనుగుటివలస గ్రామ కోనేరు చుట్టూ నిర్మిస్తున్న గోడ

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామ కోనేరు సుందరీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కోనేరు చుట్టూ ప్రస్తుతం గోడ నిర్మాణం పనులు చకచకా సాగుతున్నాయి. గ్రామస్తుల సహకారంతో ఈ పనులు జరుగుతున్నాయని, గోడ నిర్మాణం అనంతరం చెరువు అంచులో మొక్కలు నాటడం, గట్టును వాకింగ్ ట్రాక్‌గా మలచడం వంటి పనులు చేపడతామని గ్రామ యువత తెలిపింది. దాతలు విరాళాలు ఇచ్చేందుకు ముందుకు వస్తే మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు.

మానవ అక్రమ రవాణా తగదు


అవగాహన కల్పిస్తున్న పోలీసులు, వైసీబీ, సీపీయూ ప్రతినిధులు

బొబ్బిలి: మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని రైల్వే పోలీస్, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, వైసీబీ నెట్‌వర్క్‌లు ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద నిర్వహించాయి. ఈ సందర్భంగా ప్రజలకు రైల్వే పోలీసులు, స్థానిక అధికారులు అవగాహన కల్పించారు. ఎస్సైకులు, ఏఎస్సై వైఈ రావు, వి.లక్ష్మీనారాయణ, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ఇన్‌చార్జ్ ఎం. వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

వరుణుడు కరుణించె..పైరు మురిసె..


కళకళలాడుతున్న స్వీట్‌కార్న్ పంట


ఏపుగా పెరిగిన బెండ మొక్కలు


పూతకు సిద్ధంగా బంతి మొక్కలు

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పైర్లు కళకళలాడుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో నెల రోజుల కిందట రైతులు వరి, బెండ, సజ్జ, వేరశనగ, పత్తి, కంది, తదితర పంటలు సాగు చేశారు. అయితే మొదట్లో వర్షాలు పడక రైతులు ఆందోళన చెందారు. దాదాపు పంటలు పోయే పరిస్థితుల్లో మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో పైర్లు కళకళలాడుతున్నాయి. వరుణుడు కరుణించడంతో అన్నదాత మోములో చిరునవ్వు తొణికసలాడుతోంది. – రామభద్రపురం

సమగ్రంగా ఓటర్ల జాబితాలు

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఓటరు జాబితా సవరణ అవకాశాలను సద్వినియోగం చేసుకుని సమగ్ర ఓటర్ల జాబితాలు రూపొందేలా వైఎస్సార్ సీపీ బూత్ కన్వీనర్లు కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బూత్ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాబితాలోని తప్పొప్పులు సరిదిద్దడంతో పాటు కుటుంబ సభ్యులందరి ఓట్లు ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితా సవరణలో బీఎల్‌ఓలకు కన్వీనర్లు సహకరించాలని సూచించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయంలో కీలకపాత్ర పోషించాలన్నారు.

సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడం అభివృద్ధా?

టీడీపీ నాయకుడు బేబి నాయన తెలిసీ తెలియని రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు విమర్శించారు. రోడ్లు బాగా లేవని మీరు ధర్నాలు చేస్తే మేం బాగు చేస్తున్నామంటే.. అది మా బాధ్యతగా భావించి చేస్తున్నామన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం మానుకోవాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు ఇంటి గోపాలరావు, శంబంగి వేణుగోపాలనాయుడు, నాలుగు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి


పుస్తక పఠనంలో విద్యార్థులు

తెర్లాం: విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని శ్రీకాకుళం జిల్లా విద్యాశాఖ కార్యాలయ రిటైర్డ్ సూపరింటెండెంట్ పర్రి సోములు అన్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో 'చదువంటే మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సోములు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థీ చిన్నతనం నుంచే పుస్తక పఠనంపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. తరగతికి చెందిన పాఠ్య పుస్తకాలతో పాటు రామాయణం, మహాభారతం వంటి ఇతిహాస గ్రంథాలు, నీతికథల పుస్తకాలు, వార్తా పత్రికలు నిరంతరం చదవాలన్నారు. అనంతరం లైబ్రేరియన్ కృష్ణమూర్తి విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు రాయించడం, చెప్పించడం, బొమ్మలు వేయడం నేర్పించారు.

చురుగ్గా ఓటర్ సర్వే


రేగిడి: ఖండ్యాంలో జరుగుతున్న ఓటర్ల సర్వేను పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ ఏసుబాబు

రేగిడి: మండల వ్యాప్తంగా ఓటర్ సర్వే చాలా చురుగ్గా జరుగుతోంది. ఆదివారం మండలంలోని ఖండ్యాం, వెంకటాపురం, కొమెర తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లిన బీఎల్‌ఓలు ఓటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితాలో తప్పొప్పులు సవరించడంతో పాటు మృతి చెందిన ఓటర్లను జాబితా నుంచి తొలగించే పనులు చేస్తున్నారు. ఈ సర్వేను సూపర్‌వైజర్ యేసుబాబు పరిశీలించి, పక్కాగా ఓటర్ల జాబితా తయారు చేయాలని బీఎల్‌ఓలకు సూచించారు.

రాజాం: మండలంలోని గురవాం, దోసరి, అంతకాపల్లి, కంచరాం, డీఆర్‌ఎన్‌వలస, శ్యాంపురం గ్రామాల్లో ఓటర్ల సర్వే ఆదివారం చేపట్టారు. సర్వే జరుగుతున్న తీరును తహసీల్దార్ ఎస్.కె.రాజు పరిశీలించి, సక్రమంగా ఓటరు జాబితా తయారు చేయాలని బీఎల్‌ఓలకు సూచించారు.


రాజాం: శ్యాంపురంలో ఓటరు సర్వే చేస్తున్న బీఎల్‌ఓ అవినాష్

ఎమ్మెల్యే పరామర్శ


కురమమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: స్థానిక పట్టణంలోని మెంటిపేట ఎస్సీ కాలనీకి చెందిన ఆర్టీసీ కండక్టర్ యందవ కురమమ్మ కుటుంబాన్ని ఎమ్మెల్యే కంబాల జోగులు పరామర్శించారు. ఇటీవల గుండెపోటుతో ఆమె మృతి చెందగా, తల్లి మరణ వార్త విని కుమారుడు యందవ అమర్ కూడా చనిపోయిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎమ్మెల్యే కుమరమ్మ తల్లి కమలమ్మ, ఆమె చిన్న కుమారుడు జీవన్‌ను ఆదివారం కలిసి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. తల్లీకొడుకుల మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

బొబ్బిలి: మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

యుద్ధప్రాతిపదికన రోడ్డు మరమ్మతులు


పాలకొండ రోడ్డులో జరుగుతున్న రోడ్డు మరమ్మతు పనులు

రాజాం సిటీ: స్థానికంగా ఇటీవల కురిసిన వర్షాలకు పాలకొండ రోడ్డులో భారీ గోతులు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు అటువైపుగా ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్న విషయం ఎమ్మెల్యే కంబాల జోగులు దృష్టికి వచ్చింది. స్పందించిన ఆయన గోతులు పూడ్చేలా చర్యలు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ దగ్గరుండి గోతులను పూడ్చివేసే పనులను యుద్ధ ప్రాతిపదికన ఆదివారం చేపట్టారు. తాత్కాలికంగా చేపడుతున్న ఈ పనులను వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు పర్యవేక్షించి, పలు సూచనలు చేశారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

రేగిడి: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజు తెలిపారు. ఆదివారం స్థానిక ఉంగరాడమెట్ట దగ్గరున్న గురుకుల పాఠశాల, కళాశాల ఆవరణలో విలేకరులతో మాట్లాడిన ఆయన గురుకులంలోని విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య తనిఖీలు చేయిస్తున్నామన్నారు. చర్మవ్యాధులు, జ్వరాలు, పెరుగుదల, మానసిక వికాసం తదితర అంశాలను పరిశీలించి, సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతోందన్నారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాల మెరుగుదలకు అనుభవజ్ఞులైన సిబ్బందితో నాణ్యమైన విద్యాబోధన ఇప్పిస్తున్నామని, అలాగే వారి ఆరోగ్యం బాగుండేలా ప్రతి రోజూ పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు.

నేడు కమ్మవలసలో గడప గడపకు..

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం 4 గంటలకు మండలంలోని కమ్మవలసలో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి సచివాలయ, మండల పరిషత్ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

నేడు మరువాడలో గడప గడపకు..

వంగర: మండలంలోని మరువాడ గ్రామంలో ఈ నెల 31వ తేదీన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొనే ఈ కార్యక్రమానికి మండల స్థాయి పార్టీ శ్రేణులు, అధికారులంతా హాజరు కావాలని వారు కోరారు.

తొలి గురువులు తల్లిదండ్రులే..


తల్లిదండ్రులను సత్కరిస్తున్న రౌతు రామమూర్తినాయుడు, వాసుదేవరావు

బొబ్బిలి: విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించినా.. ఉద్యోగాలు సాధించినా.. వారిని మంచి నడవడికతో తీర్చిదిద్దే తొలి గురువులు వారి తల్లిదండ్రులేనని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు రౌతు రామమూర్తినాయుడు అన్నారు. ఆదివారం స్థానిక ట్రిపుల్ ఎస్ కాలేజీలో ఇటీవల ఈపీసెట్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను కూడా సత్కరించారు. కార్యక్రమంలో వాసు కాలేజ్ కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు, ప్రిన్సిపాళ్లు ఆర్. మోహనరావు, ఎం. వెంకటేష్, కె.దాలినాయుడు, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మీడియా మానటరింగ్ కమిటీ వేయాలి


నినాదాలు చేస్తున్న ప్రభావతి, తదితరులు

బొబ్బిలి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీడియా మానటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి అన్నారు. పట్టణంలో ఆదివారం పోరు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ, పోర్న్ వెబ్‌సైట్‌ను నిషేధించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి వై.సత్యవతి, సహాధ్యక్షురాలు పి. పూర్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. విజయగౌరి, జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ, అధ్యక్షురాలు పుణ్యవతి, పార్వతీపురం – మన్యం జిల్లా కార్యదర్శి ఆర్. శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు రక్షణ కల్పించాలి


మాట్లాడుతున్న దళిత బహుజన జేఏసీ నాయకులు

వంగర: మణిపూర్ రాష్ట్రంలో అణచివేతకు గురవుతున్న ఆదివాసీలకు రక్షణ కల్పించాలని దళిత బహుజన జేఏసీ నాయకులు మజ్జి గణపతిరావు, ఎం.గణపతిరావు కోరారు. మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లకు నిరసనగా మండల కేంద్రంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుకి, ఆదివాసి, గిరిజన తెగలకు చెందిన మహిళలపై దారుణాలకు పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిర్లంగి సింహాచలం, దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సచివాలయం సిద్ధం

రాజాం: మండలంలోని రాజయ్యపేట గ్రామంలో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం ప్రారంభానికి సిద్ధమైంది. దాదాపు రూ.42 లక్షల అంచనా వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించినట్లు ఎంపీడీఓ బాసూరి శంకరరావు తెలిపారు. త్వరలోనే ఈ భవనాన్ని ప్రజాప్రతినిధుల చేతులమీదుగా ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

రూ. 60 లక్షలతో మరింత అభివృద్ధి

- ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు


మాట్లాడుతున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

రామభద్రపురం: మండల పరిధిలో ఈ నాలుగేళ్లల్లో సుమారు రూ.31.50 కోట్లతో పంచాయతీరాజ్, ప్రాజెక్ట్ శాఖల పర్యవేక్షణలో అభివృద్ధి పనులు చేపడుతుండగా.. ప్రభుత్వం తాజాగా మండలానికి మరో రూ.60 లక్షలు మంజూరు చేయడంతో మరింత అభివృద్ధి చేయవచ్చునని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మండలంలో గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు, తదితర భవన నిర్మాణాలతో పాటు సీసీ, బీటీ రోడ్లు, కాలువల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. తాజాగా మంజూరైన రూ.60 లక్షలతో కొత్తగా సీసీ రోడ్లు, డ్రైనేజీలతో పాటు గ్రామాలలో ఇదివరకే చేపట్టి నిధులు సరిపడక ఆగిపోయిన పనులను పూర్తి చేస్తామన్నారు. ఈ నాలుగేళ్లలో ఇంత అభివృద్ధి జరుగుతున్నా..అభివృద్ధి ఏమీ జరగలేదని టీడీపీ నాయకులు విమర్శించడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలతో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని తెలిపారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ మరోసారి విజయం సాధించడం ఖాయమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, సీనియర్ నాయకులు డర్రు పైడిరాజు, కనిమెరక అప్పారావు, కటికి చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనుల్లో అన్నదాత బిజీ


అప్పలంపేటలో వరినారు తీస్తున్న రైతులు

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లో వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో మండల రైతాంగం అధిక విస్తీర్ణంలో వరి పంటను సాగు చేస్తుంటారు. ఈ ఏడాది తోటపల్లి ప్రధాన కుడికాలువ ద్వారా సాగునీరు విడుదల చేయడంతో పలు గ్రామాల్లోని చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. దీంతో పాటు ఇటీవల వర్షాలు కూడా కురవడంతో మండలంలోని తెర్లాం, ఆమిటి, కొరటాం, అప్పలంపేట, తదితర గ్రామాల్లో రైతులు దమ్ములు పట్టి వరినాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. నందబలగ, కుసుమూరు, తదితర గ్రామాల్లో వ్యవసాయ పంపుసెట్ల కింద ఉన్న ఆయకట్టులో నాట్లు వేస్తున్నారు.